1St Happy Work Anniversary. Year

షణ్ముఖ

RNI : APTEL / 2023 / 89152

SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక


Good for Health

Best for Readers

సంపుటి : 03 సంచిక : 144    సోమవారం 01 జూన్ 2026 పేజీలు 8   వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.


## అవి భారతీయులకు గర్వకారణం.. అనైమంగళం రాగి శాసనాలపై ప్రధాని మోదీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 31)
భారత అథ్లెట్ గుర్విందర్ సింగ్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. రాంచీలో జరిగిన జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ పోటీల గురించి ఆదివారం మన్‌కీ బాత్ 134వ కార్యక్రమంలో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. వందమీటర్ల పరుగులో రికార్డులు సృష్టించిన అథ్లెట్లు గుర్విందర్, అనిమేష్‌తో ఆయన నేరుగా మాట్లాడారు. కేవలం రెండు రోజుల్లోనే 100 మీటర్ల పరుగు పందెంలో జాతీయస్థాయిలో మూడు రికార్డులు సృష్టించామని మోదీ అన్నారు. ఈ అద్భుతమైన ఘనత సాధించిన ఇద్దరు అథ్లెట్లు గుర్విందర్ సింగ్, అనిమేష్‌కు అభినందనలు తెలిపారు. మోదీ పర్యటన నేపథ్యంలో 'అనైమంగళం' రాగి శాసనాలను నెదర్లాండ్స్ ప్రభుత్వం భారత్‌కు తిరిగి అప్పగించిన సంగతి తెలిసిందే. ఇది భారతీయులు గర్వించదగిన విషయమని మోదీ అన్నారు. ఇక, ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఓ కాలువల చిక్కుకుపోయిన డాల్ఫిన్‌ను కొందరు దాదాపు 13 గంటలపాటు శ్రమించి రక్షించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ప్రధాని మోదీ ఈ సంఘటనను కూడా మన్‌కీ బాత్‌లో మాట్లాడారు. గంటలపాటు శ్రమించి డాల్ఫిన్‌ను కాపాడినవారిని అభినందించారు. ఈ సహాయక చర్యల్లో కేంద్రం ఇటీవల కొత్తగా ప్రవేశపెట్టిన డాల్ఫిన్ అంబుల్స్ కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. కేరళలోని ఆలువా ప్రాంతంలో స్విమ్మింగ్ క్లబ్ సేవలను మోదీ ప్రశంసించారు. ఈ క్లబ్ ద్వారా ఇప్పటి వరకు 15వేల మందికి పైగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ▶మిగతా 2లో

## ఎన్నిసార్లు దొరికిపోయినా.. కుట్ర రాజకీయాలు మానరా? నారా లోకేశ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 31)
నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసమైన ఘటనపై వైకాపా శ్రేణులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. దీనిపై ఏపీ మంత్రి, తెదేపా కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ స్పందించారు. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం చేసిన జమ్ములయ్య.. వైకాపా నేతల అనుచరుడేనని ▶మిగతా 2లో

## విశాఖ కేంద్రంగా త్వరలో బుల్లెట్ రైలు: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 31)
దక్షిణ కోస్తా రైల్వే జోన్ రేపట్నుంచి ప్రారంభం కానుందని ఏపీ భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. రైల్వే జోన్‌కోసం 30 ఏళ్లుగా భాజపా పోరాడిందన్నారు. విభజన చట్టంలో రైల్వేజోన్ చేర్చడంలో ఆ పార్టీ కృషి ▶మిగతా 2లో

# ప్రతిష్ఠాత్మకంగా యోగాంధ్ర

**జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలు**

**అమరావతిలో 25వేల మందితో రాష్ట్రస్థాయి కార్యక్రమం**



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 31)
రాష్ట్రంలో యోగాంధ్ర-2026ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. జూన్ 7 నుంచి 14 రోజులు రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం చేపట్టాలని సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణపై ఉండవల్లి నివాసంలో మంత్రులు, అధికారులతో శనివారం సమీక్షించారు.

**రాజధానిలో.. కృష్ణానది వంతెనపై యోగా**

జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ రాష్ట్రస్థాయి కార్యక్రమం రాజధాని అమరావతిలో 25వేల మందితో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. రాజధాని ప్రాంతంలో కృష్ణానదిపై నిర్మించిన బ్రిడ్జిపై ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. యోగాంధ్ర కార్యక్రమాల వివరాలను ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.

జిల్లా కేంద్రాల్లో వెయ్యిమందితో జూన్ 21న నిర్వహించే కార్యక్రమాల్లో మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారు.

రాష్ట్రంలో అందుబాటులో ఉన్న 1.50 లక్షల మంది ట్రైనర్లకు అదనంగా మరో లక్షమందికి ట్రైనర్లుగా శిక్షణ ఇస్తారు.

ఒక జిల్లాకు ఒక థీమ్‌తో 14 రోజులు యోగాంధ్ర నిర్వహిస్తారు. ఇందుకు జిల్లాకు రూ.25లక్షల చొప్పున కేటాయించారు.

ప్రతి జిల్లాలోని రెండు ప్రముఖ పర్యాటక ప్రాంతాల చొప్పున.. 56చోట్ల ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయి.

14 రోజుల పాటు పార్కులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వర్ణ వార్డు- స్వర్ణ గ్రామ కార్యాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా నుంచి రాష్ట్రస్థాయి వరకు అవార్డులు అందిస్తారు. ▶మిగతా 2లో



## జూన్ 2 నుంచి రష్యాలో నారా లోకేష్ పర్యటన... పెట్టుబడులే టార్గెట్

**రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో మంత్రి లోకేష్ రష్యా పర్యటన**

**జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు రష్యాలో పర్యటించనున్న లోకేష్**

**సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక ఫోరంలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానం**

(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 31)
రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ రష్యాలో పర్యటించనున్నారు. జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు ఆయన రష్యాలో పర్యటించి, పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి, వారిని ఏపీకి ఆహ్వానించడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం.రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మక ▶మిగతా 2లో

## ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు సాగునీరు విడుదల



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 31)
ఇరిగేషన్‌పై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు ఆయన సాగునీరు విడుదల చేశారు. మంత్రి దుర్గేష్‌తో పాటు కూటమి ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. గోదావరికి జలహారతి ఇచ్చి.. మీట నొక్కి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టా కాలువకు నీటి విడుదలతో తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం.. ఆమరణ దీక్ష చేస్తానంటూ ప్రభుత్వానికి షర్మిల హెచ్చరిక



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 31)
నంద్యాల జిల్లాలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్షకు దిగుతానని కూటమి ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబును ఆమె హెచ్చరించారు. ఈ ఘటనను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.నంద్యాలలోని శ్రీనివాస సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహంపై ఓ వ్యక్తి దాడి చేసి ధ్వంసం చేశాడని ▶మిగతా 2లో

నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసంపై షర్మిల ఆగ్రహం

ఇది చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపేనని ఆరోపణ

పోలీసులు చూస్తూ ఉన్నా దాడిని ఆపలేదని విమర్శ

విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్ష చేస్తానని హెచ్చరిక

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్




## వరుసగా 2వసారి ఐపీఎల్ విజేతగా బెంగళూరు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 31)
మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేయగలిగింది. 156 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఇన్నింగ్స్ ఆరంభం నుంచే వీరవిహారం చేసింది. విరాట్ కోహ్లీ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ ప్రత్యర్థి బౌలర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించాడు. . ఆర్సీబీ కేవలం 18 ఓవర్లలోనే 5 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసి ఘన విజయాన్ని అందుకుంది.

## ఇరాన్‌తో డీల్‌పై ట్రంప్ వెనకడుగు.. చర్చలంటూనే దాడి హెచ్చరికలు

- ఇరాన్‌తో ఒప్పందంపై ట్రంప్ అధ్యక్షతన భేటీ
- ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసిన సమావేశం

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 31)



ఇరాన్‌తో అణు ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షతన వైట్‌హౌస్‌లో జరిగిన కీలక సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ భేటీ నుంచి ట్రంప్ ఏ నిర్ణయం ప్రకటించకుండానే వెళ్ళిపోయారని అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) పేర్కొంది. దీంతో ఇరు దేశాల మధ్య కుదిరిందని భావించిన తాత్కాలిక ఒప్పందం భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ సమావేశానికి ముందు ట్రంప్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, ఇరాన్‌తో ఒప్పందం జరగాలంటే కొన్ని కఠిన షరతులు విధించారు. సంఘర్షణల కారణంగా మూతపడిన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలని, ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని తయారు చేయబోమని స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను తమకు అప్పగించాలన్నది కూడా తమ ప్రధాన షరతుల్లో ఒకటని ట్రంప్ స్పష్టం చేశారు. ▶మిగతా 2లో

## 'ఎస్ఐఆర్'పై వైసీపీ క్యాడర్ ను అప్రమత్తం చేసిన సజ్జల

(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 31)
అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ఏపీలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ఈ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి నిరసన కార్యక్రమాలను ఉధృతం చేయాలని వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసన కార్యక్రమంపై ఆయన పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిన్న జూమ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ▶మిగతా 2లో

## ఏపీలో జూన్ పెన్షన్లకు రూ.2728 కోట్లు విడుదల.. కొత్తగా 5,606 మందికి లబ్ధి

**మొత్తం 62.34 లక్షల మందికి**

**పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు**

**జూన్ పెన్షన్ల కోసం రూ.2,728 కోట్లు**

**విడుదల చేసిన ప్రభుత్వం**

**కొత్త పెన్షన్ల కోసం అదనంగా రూ.2.24 కోట్ల కేటాయింపు**



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 31)
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూన్ నెలకు సంబంధించి కొత్తగా 5,606 మందికి స్పౌజ్ కేటగిరీ కింద వితంతు పెన్షన్లను మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర సెర్ప్, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 62,34,445 మంది లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసేందుకు ▶మిగతా 2లో

# ప్రతిష్ఠాత్మకంగా యోగాంధ్ర

హాయ్ అని మెసేజ్ పెడితే.. యోగా వీడియోలు

రాష్ట్రప్రభుత్వ యోగా, నేచురోపతి విభాగం సలహాదారు మంతెన సత్యనారాయణరాజు యోగాంధ్రపై రూపొందించిన గోడపత్రికను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. 90 ఆసనాల వీడియోలు, 21 ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఆసనాల వీడియోలు, రోజువారీ సాధన కోసం యోగాసనాలు, ప్రాణాయామంపై ఏడు వీడియోలు, యోగా సందేహాలు ప్రశ్నలు-సమాధానాలపై చేసిన వీడియోలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టనున్నట్లు మంతెన తెలిపారు. 8142404888 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపినా, ఈ వీడియోలు వస్తాయన్నారు. సమీక్షలో మంత్రులు నారాయణ, సత్యకుమార్ యాదవ్, ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, సీఎస్ సాయిప్రసాద్, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, కమిషనర్ వీర పాండియన్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జూన్ 2 నుంచి రష్యాలో నారా లోకేష్ పర్యటన... పెట్టుబడులే టార్గెట్

'సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరమ్' సదస్సులో పాల్గొనాల్సిందిగా మంత్రి లోకేష్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుంచి పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతారు. ఈ పర్యటనలో భాగంగా, లోకేష్ పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ముఖ్యంగా ఐటీ, విద్య, ఇతర కీలక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన చర్చలు జరపనున్నారు. ఈ పర్యటన ద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## విశాఖ కేంద్రంగా త్వరలో బుల్లెట్ రైలు: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

అనిర్వచనీయమన్నారు. విశాఖ కేంద్రంగా బుల్లెట్ రైలు త్వరలో వస్తుందని రైల్వే మంత్రి చెప్పారని మాధవ్ వివరించారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రికి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## ఎన్నిసార్లు దొరికిపోయినా.. కుట్ర రాజకీయాలు మానరా? నారా లోకేశ్

పోలీసులు తేల్చినట్లు చెప్పారు. బాబాయి గుండెపోటు, కోడి కత్తి, గులకరాయి నాటకాల రాయుడైన జగన్.. మరో కొత్త డ్రామా సృష్టించాడని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు తన గొడ్డలి పార్టీ కార్యకర్తలను సైకో జగన్ రంగంలోకి దింపారని మండిపడ్డారు. జగన్నాటకాలు చూసి జనం ఛీకొట్టినా.. డ్రామాలు మానట్లేదని అన్నారు. ఎన్ని సార్లు దొరికిపోయినా.. కుట్ర, క్షుద్ర రాజకీయాలు మానరా? అని ప్రశ్నించారు.

# మొదటి పేజీ తరువాయి

## అవి భారతీయులకు గర్వకారణం.. అనైమంగళం రాగి శాసనాలపై ప్రధాని మోదీ

ఎండలో జాగ్రత్త..ఎండల తీవ్రత దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మోదీ పలు సూచనలు చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తాగునీరు వెంట ఉంచుకోవాలన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఎండల నుంచి రక్షణ కోసం వాడే పానీయాలు మామిడి పండ్లు, మజ్జిగ, షర్బత్, బేల్‌పనా గురించి ప్రస్తావించారు.

## నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం.. ఆమరణ దీక్ష చేస్తానంటూ ప్రభుత్వానికి షర్మిల హెచ్చరిక

షర్మిల తెలిపారు. పట్టపగలు ఈ ఘటన జరుగుతుంటే, అక్కడే ఉన్న పోలీసులు నిలువరించకపోవడం హేయమైన చర్య అని ఆమె విమర్శించారు. దాడి చేసిన వ్యక్తికి మానసిక స్థితి బాగోలేదని చెప్పి పోలీసులు చేతులు దులుపుకోవడం సరికాదని అన్నారు. ఇది చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపు ఉందని షర్మిల ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి ఘటనలను చూస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ విగ్రహాలపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడితో పాటు, అతని వెనుక ఉన్న శక్తులెవరో తేల్చి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. పాత విగ్రహం స్థానంలో వెంటనే కొత్తది ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో నంద్యాలలో అదే సెంటర్‌లో తాను ఆమరణ దీక్షకు దిగుతానని ముఖ్యమంత్రిని హెచ్చరించారు.

## 'ఎస్ఐఆర్'పై వైసీపీ క్యాడర్ ను అప్రమత్తం చేసిన సజ్జల

ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. "చంద్రబాబు ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది. ఈ అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసనలను విజయవంతం చేయాలి. ప్రజాసంఘాలు, వివిధ వర్గాల ప్రతినిధులతో పాటు కలిసివచ్చే రాజకీయ పార్టీలను కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములను చేయాలి" అని ఆదేశించారు. డీఎస్సీ అంశంపై పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్యులు పడుతున్న ఇబ్బందులను కూడా ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రభుత్వ రెండేళ్ల పాలనా వైఫల్యాలపై పార్టీ కమిటీలు ప్రత్యేకంగా సమావేశమై తీర్మానాలు చేయాలని, వాటిని డిజిటల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్), ఇంటింటి సర్వే సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సజ్జల హెచ్చరించారు. అలాగే, జూన్ 1న డీఎస్సీ అంశంపై పార్టీ యువజన విభాగం చేపట్టనున్న నిరసనలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఏపీలో జూన్ పెన్షన్లకు రూ.2728 కోట్లు విడుదల.. కొత్తగా 5,606 మందికి లబ్ధి

రూ. 2,728 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని ఆయన పేర్కొన్నారు.

కొత్తగా మంజూరు చేసిన 5,606 పెన్షన్ల కోసం అదనంగా రూ. 2.24 కోట్లను విడుదల చేసినట్లు మంత్రి వివరించారు. పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారుడు మరణిస్తే, వారి జీవిత భాగస్వామికి వెంటనే అదే నెల నుంచి పెన్షన్‌ను బదిలీ చేసేలా స్పౌజ్ కేటగిరీని అమలు చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జూన్‌తో కలుపుకుని ఇప్పటివరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం రికార్డు స్థాయిలో రూ. 65,886 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. జూన్ 1వ తేదీ ఉదయం నుంచి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్లను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## ఇరాన్‌తో డీల్‌పై ట్రంప్ వెనకడుగు..

అయితే, అమెరికా పెడుతున్న ఈ షరతులను ఇరాన్ మొదటి నుంచి వ్యతిరేకిస్తోంది.

ఒకవైపు చర్చల ప్రక్రియ కొనసాగుతుండగానే, అమెరికా తన కఠిన వైఖరిని ప్రదర్శించింది. ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించడానికి తాము సిద్ధంగా ఉన్నామని అమెరికా యుద్ధ కార్యదర్శి పీట్ హెగ్సెత్ హెచ్చరించారు. సింగపూర్‌లో జరిగిన షాంగ్రీ-లా డైలాగ్‌లో ఆయన మాట్లాడుతూ.. "అవసరమైతే దాడులను పునఃప్రారంభించే సామర్థ్యం మాకుంది. మా ఆయుధ నిల్వలు అందుకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాయి" అని వ్యాఖ్యానించారు. అధ్యక్షుడు ట్రంప్ ఒక మంచి ఒప్పందం కోరుకుంటున్నారని, కానీ ఇరాన్ అణు ఆశయాలను అరికట్టేలా అది ఉండాలని స్పష్టం చేశారు. మరోవైపు అమెరికా దౌత్యపరమైన హామీలపై తమకు నమ్మకం లేదని ఇరాన్ తెలిపింది. గతంలో చర్చలు జరుగుతున్నప్పుడే తమపై రెండుసార్లు దాడులు జరిగాయని గుర్తుచేసింది. ఇరాన్ రాయభారి మహమ్మద్ బఘేర్ ఖలీబాఫ్ మాట్లాడుతూ.. "మాకు హామీలు లేదా మాటలపై నమ్మకం లేదు, కేవలం చర్యలనే విశ్వసిస్తాం. చర్చల ద్వారా కాదు, క్షిపణుల ద్వారానే మాకు రాయితీలు లభిస్తాయి" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ మాజీ కమాండర్ మొహసెన్ రెజాయీ కూడా ట్రంప్ ఉద్దేశాలను అనుమానించారు. దౌత్యానికి ట్రంప్ మూడోసారి ద్రోహం చేస్తున్నారని, చర్చల పేరుతో ఇతర లక్ష్యాలను నెరవేర్చుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ పరిణామాలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మళ్లీ పెరిగాయి.

# అద్దంకిలో కార్డన్‌సెర్చ్






(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మే 31)

మాదక ద్రవ్యాల నిర్మూలనే, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు దర్శి డిఎస్పీ పి బాలమురళికృష్ణ పర్యవేక్షణలో అద్దంకి టౌన్ లోని ఎన్టీఆర్ కాలనీలో పరిసర ప్రాంతంలో విస్తృత స్థాయిలో ఆపరేషన్ వజ్రా ప్రహార్ లో భాగంగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో అద్దంకి టౌన్ సిఐ సుబ్బరాజు, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, సంతమాగులూరు సిఐ శేషగిరిరావు, కొరిశపాడు ఎస్ఐ సురేష్, జె పంగులూరు ఎస్ఐ వినోద్ కుమార్, సంతమాగులూరు ఎస్ఐ పట్టాభిరామయ్య, 40 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ పరికరాల ద్వారా అనుమానితుల తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఇళ్లు, దుకాణాలు, పాత ముద్దాయిల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. ఆపరేషన్ లో భాగంగా 99 ద్విచక్ర వాహనాలు, ఒక కారు మరియు మూడు ఆటోలు చెక్ చేసి వాటిలో పత్రాలు లేని వాహనాలు 19 వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అద్దంకి టౌన్ సిఐ సుబ్బరాజు, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, సంతమాగులూరు సిఐ శేషగిరిరావులు మాట్లాడుతూ ప్రజలు గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలకు బానిస అయితే వ్యక్తి ఆర్థికంగా, కుటుంబ పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన అనేక అనర్థాలకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మత్తు పదార్థాల విక్రయదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఐపిఎల్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని, అలాగే క్రికెట్ ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లలో పాల్గొని లక్షల రూపాయలు కోల్పోయిన వారు ఉన్నారని, యువత వీటి నుండి దూరంగా ఉండాలని సూచించారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో, ముఖ్యంగా హెల్మెట్ ధరించకపోవడం ప్రధాన కారణమని తెలిపారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు ఫోన్ ద్వారా ఓటీపీలు చెప్పమని మోసపూరితంగా డబ్బులు దోచుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆధార్ కార్డులను అపరిచితులకు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ఆధార్ వివరాలను దుర్వినియోగం చేసి సిమ్ కార్డులు తీసుకుని నేరాలకు పాల్పడే అవకాశముందని తెలిపారు. ప్రజలతో కలిసి "మత్తుకు దూరంగా ఉండాలి-మత్తు లేని సమాజాన్ని నిర్మిద్దాం" అనే ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులు లేదా డైల్112 లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9121102266 తెలియజేయాలని ప్రజలను కోరారు.




# మంచి తహశీల్దార్ తన్నీడి రవి రాష్ట్ర మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)

మంచి తహశీల్దార్ తన్నీడి రవి అని రాష్ట్ర సాంఘీక, సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రకాశంజిల్లా శాఖ, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షతన 39 సంవత్సరాలు రెవిన్యూ డిపార్ట్మెంట్‌లో పనిచేసి ఆదివారం ఉద్యోగ విరమణ చేస్తున్న తహశీల్దార్ తన్నీడి రవి ఘన సత్కారం నిర్వహించారు. తొలుత మంత్రి స్వామి రవి దంపతులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహశీల్దార్‌గా రవి ప్రజల్లో మంచి పేరు సంపాదించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు పిన్నిక మధుసూధనరావు, జిల్లా సెక్రెటరీ రామచంద్రుని వాసుదేవరావు, జిల్లా కోశాధికారి ఊతకొలు శ్రీనివాసరావు, కలెక్టరేట్ అధ్యక్షులు బి సత్యసాయి శ్రీనివాస్, జేఏసీ జిల్లా ఛైర్మెన్ శరత్, మంజేష్, విఆర్ఓల సంఘం జిల్లా అధ్యక్షులు ఆదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజేష్, వెంకటేశ్వరరెడ్డి, రాము, వెంకటేశ్వర రాజు, కలెక్టరేట్ సిబ్బంది, జిల్లాలోని తహసీల్దార్‌లు, రిటైర్డ్ తహసీల్దార్‌లు పాల్గొని రవి దంపతులను ఘనంగా సత్కరించారు.





ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక

01.06.26 సోమవారం


# జగన్ వి అన్నీ అసత్య ప్రచారాలే



**జగన్ పీఏ అవినీతి బయటపెడితే, మెగా డీఎస్సీ పై అసత్య ప్రచారం జగన్ కి ప్రజలు బుద్ధి చెప్పిన తీరు మారలేదు మీడియా సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 31)**

ప్రజలను పక్కదారి పట్టించడానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని, ప్రజలు ఘోరంగా ఓడించి బుద్ధి చెప్పినా ఇంకా తన తీరు మార్చుకోకుండా తెలుగుదేశం పార్టీ పై అసత్య ప్రచారాలు చేయడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు విచ్చేసిన మంత్రికి మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, పార్లమెంట్ అధ్యక్షులు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, టూరిజం ఛైర్మన్ నూకసాని బాలాజీ, ఎక్సైజ్ శాఖ అధికారులు కార్యాలయంలో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి కి కూటమి పై బురదజల్లే ప్రయత్నాలు చేయడం అలవాటుగా మారిందన్నారు. రాష్ట్ర సంక్షేమం, (తరువాయి 4లో...)



# ఉమ్మడి ప్రకాశం జిల్లాకు పెద్ద మొత్తంలో నిధులు

**ఇంటిగ్రేటెడ్ హార్టికల్చరల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కింద రాబోయే మూడేళ్లలో గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.920 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు రోడ్లతో పాటు వెలిగొండ ఫేజ్ 2, కొరిశపాడు, పాలేరు రిజర్వాయర్ పనులకు ప్రాధాన్యత ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల తరపున సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి మంత్రి స్వామి కృతజ్ఞతలు**



**(షణ్ముఖ వెలుగు, కొండపి, మే 31)**

ఇంటిగ్రేటెడ్ హార్టికల్చరల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కింద ఉమ్మడి ప్రకాశం జిల్లాకు పెద్ద మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం పట్ల రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం మంత్రి డాక్టర్ స్వామి పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఇంటిగ్రేటెడ్ హార్టికల్చరల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు లో రాయలసీమ జిల్లాతో పాటు ఉమ్మడి ప్రకాశం (ప్రకాశం, మార్కాపురం) జిల్లాను కలిపి పెద్ద మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఐహెచ్‌డిపి తో నీటి పారుదల అభివృద్ధి, రహదారుల అనుసంధానం, ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాకు రాబోయే మూడేళ్లలో గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ. 920 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రోడ్లతో పాటు వెలిగొండ ఫేజ్ 2, కొరిశపాడు, పాలేరు రిజర్వాయర్ పనులకు ప్రాధాన్యతనిచ్చింది. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చరల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుతో ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రామీణ రోడ్ల రూపు రేఖలు మారిపోతాయి. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉద్యాన పంటల సాగు పెరిగి హార్టికల్చర్ హబ్ గా మారుతుంది. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

# మార్కాపురం జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈగా ఎస్ ఎ కరీం

**త్వరలో బాధ్యతల స్వీకరణ**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 31)**

నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాకు ఒకొక్క శాఖకు జిల్లా అధికారి నియమితులవుతున్నారు. ప్రజుల ఎదుర్కొంటున్న పలు సమస్యలను మరింత వేగంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా స్థాయి అధికారుల నియామకానికి చర్యలు చేపట్టింది. అందులో భాగంగా విద్యుత్‌శాఖ జిల్లా ఎస్ఈ గా ఎస్ ఏ కరీంను నియమిస్తూ ఏపిసిపిడిసిఎల్ ఛైర్మన్ అండ్ ఎండి పి పుల్లారెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఎస్ ఏ కరీం గుంటూరి, సిఆర్‌డిఏ పరిధిలో ఈఈ గా బాధ్యతలు నిర్వరిస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వివిధ హెూదాల్లో పని చేసిన ఎస్ ఏ కరీం నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈగా నియమించడంతో ఈ ప్రాంత విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. పశ్చిమ ప్రాంతానికి ఎస్ ఏ కరీం అందరికీ సుపరిచితులే...ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొనే అనేక సమస్యలు అన్ని తెలిసిన వ్యక్తిగా జిల్లా విద్యుత్‌శాఖ బాస్‌గా నియమితులు కావడంతో ఈ ప్రాంతంలో విద్యుత్ కష్టాలకు కొంత మేర చెక్ పెట్టినట్లే. ఒకటి రెండు రోజుల్లో ఆయన జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ గా బాధ్యతలు చేపట్టనున్నట్లు షణ్ముఖ వెలుగు ప్రతినిధికి తెలిపారు.

# పొదిలి ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక అధ్యక్షుడిగా చప్పిడి శ్రీను



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 31)**

మార్కాపురం జిల్లా పొదిలి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ప్రింట్, ఎలక్ట్రానిక్, వెబ్ మీడియా సభ్యుల ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా చప్పిడి శ్రీను ఎన్నికయ్యారు. కమిటీలోని మిగిలిన ముఖ్య బాధ్యులను కూడా సభ్యులందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా జి కిషోర్, ప్రధాన కార్యదర్శిగా జె కె విశ్వనాథ్, సంయుక్త కార్యదర్శిగా ఓబులశెట్టి రాధాకృష్ణ, కోశాధికారిగా ముల్లా హసన్ వలి (బడే), గౌరవ సలహాదారులుగా మందగిరి వెంకటేష్ యాదవ్, ఆర్ మదార్‌వలి, కోవూరి శ్రీనివాసులు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ పై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన మీడియా మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పొదిలి ప్రెస్ క్లబ్‌ను అన్ని విధాలా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ క్రమంలో నూతన కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారికి ప్రెస్ క్లబ్ సభ్యులు, తోటి పాత్రికేయులు, పలువురు ప్రముఖులు ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆవులూరి నాగేశ్వరికి కన్నీటి వీడ్కోలు

**కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర**

**యలమందను పరామర్శించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు**







**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 31)**

గత పది రోజుల క్రితం తీర్థయాత్రల్లో భాగంగా బద్రీనాథ్, కేథార్‌నాథ్ యాత్రా సందర్శనార్థం వెళ్ళి పొదిలి మండల మాజీ జడ్పీటిసి సభ్యురాలు ఆవులూరి నాగేశ్వరి అకాల మరణం

## పెదగంజాం వాసికి నందమూరి తారక రామారావు నేషనల్ అవార్డు



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మే 31)**

చిన్నగంజాం మండలంలోని పెదగంజాం పంచాయతీ గోల్లపాలెం గ్రామానికి చెందిన మద్దిన ఏడుకొండలు యాదవ్‌కు నందమూరి తారక రామారావు నేషనల్ అవార్డు దక్కింది. శనివారం శ్రీ దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ అనుబంధ సంస్థ విశాఖ ఆధ్వర్యంలో నటరత్న డాక్టర్ నందమూరి తారక రామారావు 103 జయంతి, దర్శక రత్న డాక్టర్ దాసరి నారాయణరావు 80వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విశాఖ పౌర గ్రంథాలయం నందు జరిగిన కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకంలో పూల సిద్దయ్య పాత్రలో ఉత్తమ అభినయంకు నటరత్న డాక్టర్ నందమూరి తారక రామారావు నేషనల్ అవార్డును దర్శక నిర్మాత ప్రసన్న కుమార్ చేతుల మీదుగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణరావు, సంగీత సామ్రాట్ ఫౌండర్ డాక్టర్ఈవి కృష్ణమాచార్యులు, సినీ దర్శకుడు దుగ్గివలస దివాకర్, పోస్టుమాస్టర్ ఆర్టిస్ట్, సోషల్ యాక్టివిటీస్ తురక సుబ్బారావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పివి భాస్కరరావు సమక్షంలో అవార్డును ఆయన అందుకున్నారు. మండలంలోని పెదగంజాం గోల్లపాలెంకి చెందిన మద్దిన వెంకటేశ్వర్లు, బోందమ్మ దంపతులకు ఏకైక కుమారుడైన మద్దిన ఏడుకొండలు యాదవ్ కి డాక్టర్ నందమూరి తారక రామారావు నేషనల్ అవార్డు రావటం పట్ల మండలంలోని పలువురు ప్రముఖులు అభినందించారు.

## హజరత్‌గూడెంలో అవగాహన కార్యక్రమం

### కంభం ఎస్ఐ శివకృష్ణారెడ్డి



**(షణ్ముఖ వెలుగు, కంభం, మే 31)**

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కంభం మండలంలోని హజరత్‌గూడెం గ్రామంలో కంభం ఎస్ఐ శివకృష్ణారెడ్డి గ్రామ ప్రజలతో సమావేశమై పలు అంశాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ గురించి వివరించి, ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి ఎలా తీసుకెళ్లవచ్చో అవగాహన కల్పించారు. అదే విధంగా మహిళల పై జరిగే నేరాలు, సైబర్ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు ఎవరికీ తెలియజేయవద్దని హెచ్చరించారు. రోడ్డు భద్రత పై కూడా అవగాహన కల్పిస్తూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. రహదారి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్రజలు పోలీసుశాఖకు సహకరించి గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడాలని ఎస్ఐ శివకృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులు కార్యక్రమాన్ని అభినందిస్తూ పోలీసుల సూచనలను పాటిస్తామని తెలిపారు.

# జగన్ వి అన్నీ అసత్య ప్రచారాలే





అభివృద్ధి కోసం తాము అనేక ప్రణాళికలు రూపొందిస్తే వాటిని అబద్దాలుగా చూపుతూ పబ్బం గుడుపుకుంటున్న ఘనుడు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. అమరావతి గురించి మాట్లాడితే మావిగన్ అంటాడు. జగన్ పీఏ అవినీతి బయటపెడితే మెగా డీఎస్సీ గురించి అబద్దాలు చెబుతున్నాడని, లిక్కర్ స్కామ్ బయటపెడితే ఇంకోటి ఏదో మాట్లాడుతాడని, మతి భ్రమించి మాట్లాడుతున్న జగన్ తీరు మార్చుకోవాలన్నారు. అసలు జగన్ పీఏకు రూ.100ల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయన్నారు. పీఏనే విలాసవంతమైన జీవితం, విదేశాలలో సరదాలు చేస్తుంటే నాడు తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.లక్షల కోట్లు దోచుకున్న జగన్, వైసీపీ అధికారంలో ఉన్నపుడు జగన్‌మోహన్‌రెడ్డి మరెన్నో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీని విమర్శిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. రెండు రోజుల పాటు జరిగిన మహానాడు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు మెచ్చుకున్నారన్నారు. రాష్ట్ర ప్రగతి కోసం అనేక అంశాలను చర్చించడం జరిగిందన్నారు. దీనిని ఓర్వలేని జగన్ మోహన్‌రెడ్డి ఏదేదో మాట్లాడుతున్నారని అన్నారు. అసలు మెగా డీఎస్సీ పై మాట్లాడే అర్హత వైసీపీకి లేదన్నారు. తాను అధికారంలో ఉన్నపుడు ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయని ఆయన కూటమి ప్రభుత్వం పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తాము ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా సూపర్ సిక్స్ సమర్ధవంతంగా అమలు చేశామన్నారు. అలాగే విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఒక ప్రణాళిక పద్దతిన మెగా డీఎస్సీ క్యాలెండర్ ప్రకటించి, వేల సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారన్నారు. తల్లికి, చెల్లికి కూడు పెట్టలేని నాయకుడు, రాష్ట్ర మహిళలకు ఏమి న్యాయం చేస్తారని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం జరుగుతుందన్నారు. క్రిమినల్ బ్రెయిన్ కలిగిన జగన్మోహన్‌రెడ్డి నీచ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. నెల్లూరులో మత్స్యకారులకు సమస్యమ వచ్చినపుడు ప్రభుత్వం స్పందించిందన్నారు. తమిళనాడు బోట్లు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు స్పీడ్ బోట్లను తెప్పించి మత్స్యకారులకు రక్షణ కల్పించడం జరిగిందన్నారు. యుద్ధం కారణంగా ఆక్వా రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నాయని, ఇంటర్నేషనల్ మార్కెట్లో ధరల మధ్య తేడాలు ఉన్నందున దీని పై ప్రభుత్వం ఒక ఆలోచన చేస్తుందన్నారు. మీడియా సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, ఎఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, తంజావూరు శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ లక్ష్మి, పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# నాగేశ్వరికి కన్నీటి వీడ్కోలు





చెందారు. గత శుక్రవారం కేధార్‌నాథ్‌లో వెళ్ళి తీవ్ర అస్వస్థకు గురయ్యారు. ఆసుపత్రికి తీసుకెళ్ళే క్రమంలో మృతి చెందిన ఆమె భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం పొదిలికి తీసుకువచ్చారు. ఈ ఉదయం పొదిలి పట్టణంలని విశ్వనాథపురం మొదటి లైన్‌లో వారి స్వగృహం వద్ద ఉంచిన పార్థీవ దేహాన్ని పొదిలికి చెందిన పలువురు ప్రముఖులతో పాటు పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు సందర్శించి ఆమెకు నివాళు లర్పించారు. గత రెండు రోజులుగా వారి ఇంట విషాధ ఛాయలు నెలకొనడంతో శుక్రవారం రాత్రి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, శనివారం రాత్రి మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, ఆదివారం కంభం, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యేలు ఉడుముల శ్రీనివాసరెడ్డి, అన్నా వెంకట రాంబాబు, మార్కాపురం నియోజకవర్గ టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, యువ నాయకుడు కందుల విగ్నేష్‌రెడ్డి, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసాహెబ్, మర్రిపూడి ఎంపిపి వాకా వెంకటరెడ్డి, కెకెమిట్ల మాజీ ఎంపిపి వేంపాటి రమణమ్మ, ముల్లా ఖుద్దూస్, వరికుంట్ల అనిల్, దోర్నాల అంజిరెడ్డి, కాటూరి వెంకట నారాయణబాబు, కాటూరి నారాయణ ప్రతాప్, షేక్ రసూల్ మహమ్మద్, మీగడ ఓబుల్‌రెడ్డి, గునుపూడి భాస్కర్, షేక్ గౌస్ భాష, పోపూరి నరేష్‌బాబు, సామంతపూడి నాగేశ్వరరావు, యక్కలి శేషగిరిరావు, మీగడ ఈశ్వర్‌రెడ్డి, చెన్నారెడ్డి, వరికూటి నాగరాజు, శ్రావణి వెంకటేశ్వర్లు, తానికొండ వెంకట్రావు, తదితరులు పాల్గొని ఆమెకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

**ఆవులూరి ఇంటి విషాధ ఛాయలు...**

ఆ ఇంట కాళ్ళపారాణి ఆరకముందే ఆ ఇంటి మహాలక్ష్మి అనంత లోకాలకు పయనమవడం ఆవులూరి ఇంటి తీవ్ర విషాధాన్ని నింపింది. తీవ్ర మనోవేదనను మిగిల్చింది. కుమారుడి వివాహాన్ని కళ్ళారా చూసుకున్న ఆ కన్నతల్లి తన మొక్కు తీర్చుకునేందుకు ఆ పరమశివుడు సన్నిధికి పయనమై ఆయన సన్నిధిలోనే అకాల మరణం చెందడం పొదిలి ప్రాంత ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది. వివరాల్లోకి వెళితే పొదిలి తాలుకాలో చిరపరిచితులైన కంభాలపాడు గ్రామ వాస్తవ్యులు ఆవులూరి కుటుంబంలో రాజకీయంగా మంచి గుర్తింపు ఉన్న తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద సతీమణి, పొదిలి మాజీ జడ్పీటిసి సభ్యురాలు ఆవులూరి నాగేశ్వరి అనుకోకుండా తనువు చాలించడం వారి కుటుంబాన్ని కన్నీటి సంద్రంలో ముంచింది. విధి రాతకు తలవంచి 20 రోజుల క్రితం కుమారుడి పెళ్ళితో ఆనంద భాష్పాలు విరజిల్లిన ఆ కుటుంబంలో ఆమె మరణం వారి కుటుంబ సభ్యులను కన్నీటికి సంద్రంలో వదిలి వెళ్ళిపోవడం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. వృత్తి రీత్యా లండన్‌లో స్థిరపడిన కుమారుడి వివాహం గత నెల 9వ తేదీన అంగరంగ వైభవంగా జరిగింది. ఇద్దరు కూతుర్లు తోబుట్టువు వివాహానికి ఆగమేఘాల మీద విదేశాల నుంచి వచ్చి అక్షింతలు వేసి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో సంతోషంగా గడిపారు. కుమారుడి పెళ్ళి అనంతరం మొక్కుబడిలో భాగంగా పది రోజుల క్రితం కేధార్‌నాథ్ తీర్థయాత్రకు వెళ్ళారు. కేధార్‌నాథ్‌లో జ్యోతిర్లింగాన్ని దర్శించుకునేందుకు వెళ్ళిన ఆమె కొద్దిగా అస్వస్థతగా ఉండడంతో స్థానిక ఓ చిన్న ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యంలో ఆమె తనువు చాలించారు... అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఆమె మృతదేహాన్ని మూడు రోజుల అనంతరం పొదిలికి తీసుకువచ్చి ఘనంగా అంతిమవీడ్కోలు పలికారు. ఆదివారం సాయంత్రం పొదిలి పట్టణంలోని ఆమె స్వగృహం నుంచి కంభాలపాడులోని వారి వ్యవసాయ క్షేత్రాన్ని కైలాస వైకుంఠ వాహనంలో ఆమెను చివరి మజిలీ వరకు తరలించి దహన సంస్కారాలు నిర్వహించారు....









# నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 31)**

ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా 'ఆపరేషన్ వజ్రప్రహార్'లో భాగంగా కందుకూరు పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిని లక్ష్యంగా చేసుకుని ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కందుకూరు డిఎస్పీ బాలసుబ్రమణ్యం అధ్వర్యంలో కందుకూరు సర్కిల్ సిఐ అన్వర్ భాష, సబ్ డివిజన్‌లోని 5 మంది ఎస్ఐలు, 40 మంది పోలీస్ సిబ్బంది కలసి ఉలవపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని వరి చేను సంఘం గ్రామం, పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 'ఆపరేషన్ వజ్రా ప్రహార్'లో భాగంగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. అదే విధంగా అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించి వారి యొక్క వేలిముద్రలను ఫింగర్ ప్రింట్స్ ఐడెంటిఫికేషన్ ద్వారా తనిఖీ చేయటం నేర నియంత్రణకు జిల్లా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా కందుకూరు డీఎస్పీ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ క్రికెట్ ఐపీఎల్ ఫైనల్ సందర్భంగా యువత క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి నష్టపోకుండా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని, క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తాయని చెప్పే మోసగాళ్లను నమ్మకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. క్రికెట్ ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లలో పాల్గొని లక్షల రూపాయలు కోల్పోయిన వారు ఉన్నారని, ఇవి ఆర్థికంగా, విద్యాపరంగా తీవ్ర నష్టాలకు దారితీసే అవకాశం ఉన్నందున యువత ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. యువత, ప్రజలు గంజాయి సహా అన్ని రకాల మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబ, ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం, మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల కాల్స్‌కు స్పందించి ఓటీపీలు చెప్పవద్దని హెచ్చరించారు. అలాగే ఆన్‌లైన్ గేమ్స్, క్రికెట్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని, ఆధార్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని తెలిపారు. చట్టాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, ప్రజలతో కలిసి "మత్తుకు దూరంగా ఉండాలి-మత్తు లేని సమాజాన్ని నిర్మిద్దాం" అనే ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులు, ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 లేదా డయల్ 112 లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9121102266 తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ తనిఖీలో ఉలవపాడు, కొండపి, కందుకూరు, గుడ్లూరు, వివిపాలెం ఎస్ఐలు జి సుబ్బారావు, టి త్యాగరాజు, శివనాగరాజు, కె వెంకట్రావు, మదిరి నాయుడు, 40 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.







# పోలీస్ అధికారులు, సిబ్బందికి సన్మానం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)**

సుదీర్ఘకాలం సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులు, సిబ్బందిని సన్మానించి, వారికి జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా గడపాలని ఆయన ఆకాంక్షించారు. పోలీసు శాఖలో విశేష సేవలు అందించి పదవీ విరమణ పొందిన ఎస్ఐలు, ఏఎస్ఐ, సిబ్బందిని జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో సత్కరించి, వెండి జ్ఞాపికలను బహుకరిస్తూ ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగానికి రిటైర్మెంట్ ఉన్నా, వ్యక్తిత్వానికి మాత్రం రిటైర్మెంట్ ఉండదన్నారు. సుదీర్ఘకాలం విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు, కఠిన పరిస్థితులు ఎదుర్కొంటూ ఉద్యోగ బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేయడం చాలా ఆనందదాయకమని తెలిపారు. పోలీసు శాఖలో క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావంతో బాధ్యతాయుతంగా జిల్లా పోలీసు శాఖకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. వారి యొక్క సర్వీస్ లో రివార్డ్స్, సేవాపతకం, ఉత్తమ సేవాపతకం, గుడ్ సర్వీస్ పొందియున్నారు. సకాలంలో రిటైర్మెంట్ ప్రయోజనాలు అందేటట్లు అన్ని చర్యలు తీసుకుంటామని, వచ్చిన డబ్బులను జాగ్రత్తగా, సరైన ప్రణాళికతో వినియోగించుకోవాలని సూచించారు. పోలీసు ఉద్యోగంలో సేవలందించేందుకు సహాయ, సహకారాలు అందించిన కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసుశాఖ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. అలాగే, పదవీ విరమణ తర్వాత ఏవైనా సమస్యలు ఎదురైతే నేరుగా తనను సంప్రదించవచ్చని, పోలీసు శాఖ ఎల్లవేళలా వారికి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో జి సుబ్రహ్మణ్యం (ఎస్ఐ), బి రాంబాబు (ఏఆర్ఎస్ఐ), ఏ సత్యం (ఏఎస్ఐ), కట్టా రమణయ్య(హెచ్‌సి)లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సీతారామిరెడ్డి, ఎఆర్ఎస్ఐ తిరుపతిస్వామి, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జూవెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిని ఖాళీ చేసి వెళ్లిపోవాలి

## పాత కమిటీకి నూతన కమిటీ సూచన

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)**

ఒంగోలు జూవెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చికి సంబంధించిన మెటీరియల్ సోమవారం సాయంత్రం లోగా తమకు అందించి అక్కడ ఖాళీ చేసి వెళ్లిపోవాలని నూతన కమిటీ పాత కమిటీకి స్పష్టం చేసింది. చర్చి మెటీరియల్ తమకు ఇవ్వకుంటే, తామే రంగంలోకి దిగి వాటిని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించింది. ఆదివారం ఆరాధన ముగిసిన అనంతరం చర్చిలో నూతన కమిటీ కార్యదర్శి తాటిపర్తి చిరంజీవి, కోశాధికారి రేచల్, కమిటీ సభ్యులు డీజే ఆశీర్వాదం మీడియాతో మాట్లాడారు. జిల్లా రిజిస్ట్రార్ ఆళ్ల బాలాంజనేయులు చర్చి కమిటీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నిక సజావుగా చేసిన రిజిస్ట్రార్ పై, చర్చి సీనియర్ పాస్టర్ పై పాత కమిటీ వారు చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. తాము ఎన్నికైనప్పటికీ ఓడిపోయినవారు దౌర్జన్యం చేసి ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని, వారి బెదిరింపులకు భయపడేది లేదన్నారు. ఓటమి పాలైనవారు అసభ్యకరంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. పాస్టర్ జాన్ అగస్టిన్ పై ఎలాంటి స్టే లేదని, ఎన్నికలకు ముందు పుల్పిట్ ఎక్కితే ప్రజలను, ఓటర్లను ప్రభావితం చేస్తారన్న ఉద్దేశ్యంతో ఆగమని చెప్పారని, ఇందుకు సంబంధించి ఈనెల 17వ తేదీ కోర్టు నుండి స్పష్టమైన ఉత్తర్వులు వస్తాయని వారు వివరించారు. ఈ సమావేశంలో జేఎంబి చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# వాసవి కుటుంబ సురక్ష పథకం కింద రూ.5 లక్షల చెక్కు అందజేత



**(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, మే 31)**

వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వాసవి కుటుంబ సురక్ష పథకం ద్వారా సభ్యుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ పథకంలో సభ్యుడు అనుకోని పరిస్థితుల్లో మరణించిన పక్షంలో వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తారు. వాసవి క్లబ్ వనిత వైష్ణవి వేటపాలెం సభ్యురాలు గట్టా సుబ్బరావమ్మ మరణించగా, ఆమె నామినీ గట్టా శ్రీనివాస్‌రావుకు వాసవి కుటుంబ సురక్ష పథకం కింద రూ.5 లక్షల చెక్కును ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ చుండూరు గాయత్రి, ఐవీఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ దొగుపర్తి బాలకృష్ణ, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చుండూరు సురేష్, రీజన్ చైర్మన్ పొట్టి శైలజ, క్యాబినెట్ జాయింట్ సెక్రటరీ కోడూరి రామలింగేశ్వరరావు, వేటపాలెం క్లబ్ అధ్యక్షురాలు లక్ష్మీ తులసి, నాగాంజనేయులు, శ్రీరామ్ గోవర్ధన్ తదితరులు పాల్గొని చెక్కును అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# మిరియంను పరామర్శించిన బీసీ నాయకులు



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 31)**

139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులును ఆదివారం కందుకూరు నియోజకవర్గ బీసీ నాయకులు అమ్మన బోయిన మాధవ, సన్నిబోయిన లింగయ్య, కరేడు గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు మేకనబోయిన చెంచయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు మద్రిబోయిన వెంకయ్య, తదితరులు పరామర్శించారు. ఏ సమస్య వచ్చినా ముందుండి పోరాడేటువంటి వ్యక్తి శ్రీనివాసులు అని, అలాంటి వ్యక్తి త్వరగా కోలుకొని పూర్తి ఆరోగ్యంగా ఉండాలని కోరారు.

# గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు







**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 31)**

మండల కేంద్రమైన ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులతో ముందుగా నీతి కథలు జాతీయ నాయకుల జీవిత చరిత్రలు మొదలగు పుస్తకాలు చదివించి అనంతరం పిల్లలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసే క్రమంలో వారికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. అనంతరం వారికి స్నాక్స్ అందించడం జరిగినది. ప్రతి రోజూ జరిగే ఈ వేసవి విజ్ఞాన తరగతులకు ఎక్కువ మంది విద్యార్థులను గ్రంథాలయానికి పంపిస్తున్న తల్లిదండ్రులకు గ్రంథ పాలకుడు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మొత్తం 40 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథాలయ పాలకుడు డి కోటేశ్వరరావు తెలియజేశారు.

# సీపీఐ జెండా ఆవిష్కరణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31) సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని పేర్ణమిట్ట గ్రామంలోని గుజ్జులా సరళదేవి నగర్‌లో మేడే వేడుకలు అంబరాన్ని తాకాయి. సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు సిపిఐ జెండా



ఆవిష్కరించి, ఎగురవేయగ నియోజకవర్గ కార్యదర్శి నల్లూరి మురళీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీ, కోలాటం స్థానికులను ఎంతగానో ఆకర్షించాయి.

# పీజీఆర్ఎస్ కార్యక్రమ సమయాల్లో మార్పులు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 31) సోమవారం మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉదయం 10 నుంచి 1 గంట వరకు జరుగుతుంది. జిల్లాలోని ప్రజలు ఈ మార్పును గమనించాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో రాసుకొని అధికారులకు అందజేయాలని ఆమె కోరారు.

# అరఫత్ నగర్‌లో రోడ్డు ప్రమాదం

## ప్రయివేటు ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు



(షణ్ముఖ వెలుగు, కంభం, మే 31) మండల కేంద్రంలోని అరఫత్ నగర్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రయివేట్ ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం, కంభం పట్టణానికి చెందిన గొంగటి రంగారెడ్డి, వాసవి విద్యానికేతన్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆయన కంభం నుంచి తన స్వగ్రామమైన కందులాపురంకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అరఫత్ నగర్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రంగారెడ్డి తల రోడ్డుకు బలంగా తాకడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడిని ప్రాథమిక చికిత్స అనంతరం కంభం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గొంగటి రంగారెడ్డి ని వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఒంగోలు కి తరలించారు. ప్రమాదంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# ఆపరేషన్ వజ్రప్రహార్‌లో భాగంగా కార్డన్ సెర్చ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31) ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు అధ్వర్యంలో ఒంగోలు రూరల్ సీఐ శేషగిరి, సంతనూతలపాడు ఎస్ఐ అజయ్ బాబుతో పాటు ఒంగోలు సబ్ డివిజన్ 4 మంది ఎస్ఐలు, 45 మంది పోలీస్ సిబ్బంది సంతనూతలపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గుమ్మాలపాడులోని ఎస్సీ కాలనీ, పాముల కాలనీ, పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 'ఆపరేషన్ వజ్రా ప్రహార్' లో భాగంగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తనిఖీలలో భాగంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఇళ్లు, దుకాణాలు, పాత ముద్దాయిల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. పత్రాలు లేని 19 ద్విచక్ర వాహనం, రెండు ఆటోలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు క్రికెట్ బెట్టింగ్‌ల వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించారు. బెట్టింగ్‌లకు పాల్పడడం వల్ల ఆర్థిక నష్టాలతో పాటు విద్యాభ్యాసంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. తక్కువ సమయంలో అధిక ఆదాయం సంపాదించాలనే ఆశతో కొందరు యువత క్రికెట్ బెట్టింగ్‌ల వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల బానిసత్వం ఆర్థిక, కుటుంబ పరమైన సమస్యలకు దారితీస్తుందని, మత్తు పదార్థాల విక్రయం, వినియోగంపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలు, బాలికల భద్రత, చట్టాలు, శిక్షల పై అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో, ముఖ్యంగా హెల్మెట్ ధరించకపోవడం ప్రధాన కారణమని తెలిపారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు ఫోన్ ద్వారా ఓటీపీలు చెప్పమని మోసపూరితంగా డబ్బులు దోచుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆధార్ కార్డులను అపరిచితులకు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ఆధార్ వివరాలను దుర్వినియోగం చేసి సిమ్ కార్డులు తీసుకుని నేరాలకు పాల్పడే అవకాశముందని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తాయని ఆశ చూపించి మోసాలు చేసే వ్యక్తులు సమాజంలో పెరుగుతున్నారని, అలాంటి వారిని నమ్మకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజలతో కలిసి "మత్తుకు దూరంగా ఉండాలి-మత్తు లేని సమాజాన్ని నిర్మిద్దాం" అనే ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు, డయల్ 112 లేదా పోలీస్ వాట్స్ అప్ నెంబర్ 9121102266 తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ తనిఖీలో మద్దిపాడు, నాగులుప్పలపాడు, జరుగుమల్లి, ఒంగోలు తాలుకా ఎస్ఐలు వెంకటసూర్య, మహేంద్ర, భాగ్యరాజు, ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.





# 10వ తరగతిలో మెరిసిన మత్స్యకార విద్యార్థులకు అభినందన ప్రతిభా పురస్కారాలు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31) శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో 10వ తరగతిలో మెరిసిన మత్స్య కార విద్యార్థులకు అభినందన ప్రతిభా పురస్కారాలు 2026 ప్రధానం చేయడం జరిగింది. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ, వారికి ప్రోత్సాహకంగా బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం స్థానిక ఎంజీవో హోంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర భూగర్భ గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి, రాజ్యసభ మాజీ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్, డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు 589 మార్కులతో మొదటి స్థానం సాధించిన ఊళ్లపాలెంకు చెందిన విద్యార్థిని కొక్కిలగడ్డ భార్గవిని శాలువాతో ఘనంగా సన్మానించి రూ.10,116 స్కాలరషిప్ నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందచేశారు. 500 పైగా మార్కులు సాధించిన మిగిలిన విద్యార్థులందరినీ శాలువాతో సన్మానించి రూ.1,116 నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందచేసి సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి, అతిధులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ఫలితాలు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యే సమాజ అభివృద్ధికి పునాది అని, నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అని అన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన సుమారు 100 మందికి పైగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ నగదు బహుమతులు విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపి, ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి గొప్ప ప్రేరణ కలిగించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ, శాంత కుమారి దంపతులను అందరు ప్రత్యేకంగా అభినందించడం జరిగింది. ఏపి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఏపి పర్యాటకశాఖ కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, పొడపాటి తేజస్వీ, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, చైర్మన్ వేంకటరావు ప్రత్యేకంగా పాల్గొని ప్రతిభా పురస్కారం అందుకున్న విద్యార్థులను అభినందించి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న డాక్టర్ వంశీ కృష్ణ దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ హాస్పిటల్ అధినేత, సీనియర్ ఎముకలు, కీళ్లు, నరములు, కీళ్ల మార్పిడి, యాక్సిడెంట్, వెన్నెముక శస్త్ర చికిత్స నిపుణులు, చీఫ్ జాయింట్ రీప్లేస్ మెంట్ సర్జన్ డాక్టర్ చాపల వంశీ కృష్ణ, సీనియర్ గర్భకోశ ప్రసూతి వైద్య నిపుణులు, హైరిస్క్ ప్రెగ్నన్సీ స్పెషలిస్ట్ డాక్టర్ చాపల శాంత కుమారి, ప్రత్యేక అతిధులుగా సీఐ కిషోర్ కుమార్, అవనిగడ్డ నాగయ్య, పిన్ని శ్రీనివాసవర్మ, డాక్టర్ నాగిడి కుమార్ వర్మ, సంగాని శ్రీనివాసరావు, డాక్టర్ పొక్కినగారి ఏడుకొండలు, వాయల విజయ రత్నం, వాయల యానాది, సున్నపు తిరుపతిరావు, మత్స్యకార సంక్షేమ సమితి నాయకులు, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఎస్సీ, ఎస్టీ కేసు కట్టించి నళిని కుటుంబానికి 4 లక్షల రిలీఫ్ మంజూరు చేయించిన దళిత నేత నీలం నాగేంద్రరావు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)

ఒంగోలు కబాడీ పాలెంకు చెందిన దళిత యువతి మైరాల నళిని వంచనకు గురై బలవన్మరణం చెందిన ఘటనలో ఒంగోలు స్థానిక ఎమ్మెల్యే పోలీస్ అధికారులతో కేసు కట్టకుండా అడ్డుపడినా దళిత నేత నీలం నాగేంద్ర పోలీస్ అధికారులతో పోరాడి ఎస్సీ, ఎస్టీ కేసు కట్టించారు. మైరాల నళిని బలవన్మారం ఎస్సీ, ఎస్టీ కేసులో ఎట్టకేలకు జిల్లా కలెక్టర్ రాజాబాబుచే రూ.4,12,500 రిలీఫ్ మంజూరు చేయించారు. ఒంగోలు కబాడీపాలెంకు చెందిన మైరాల నళిని ఎంటెక్ చదివి సింగోతు శ్రీనివాస్ అనే మత్స్యకార కులానికి చెందిన యువకుడిని ప్రేమించింది. తమ తల్లిదండ్రులు ఎస్సీ కులానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటానికి ఇష్టపడటం లేదని పెళ్లి చేసుకోకుండా మోసం చేయటంతో డిసెంబర్ 7వ తేదీన బల్వన్మరణం చెందింది. తన చావుకు తనను ప్రేమించి మోసం చేసిన సింగోత్ శ్రీనివాస్ మరియు అతని కుటుంబ సభ్యులు కారకులని సూసైడ్ లెటర్ రాసింది. అలాగే తనకు బీసీ కులానికి చెందిన సింగోతు శ్రీనివాస్ కి మధ్య నడిచిన ప్రేమ ప్రయాణం వాట్సాప్, ఇంస్టాగ్రామ్ మెసేజ్ లు, ఫోటో లు గల ఆధారాలను హుటావుటిన ఒంగోలు వన్ టౌన్ సిఐ నాగరాజు తీసుకుని వెళ్లారు. నళిని సూసైడ్ లెటర్ మరియు సాక్షాధారాలు ప్రకారం కేసు కట్టకుండా బిఎన్ఎస్ 194 అనుమానాస్పద మరణంగా తెలుగుదేశం ఎమ్మెల్యే ఆదేశాలతో ఒంగోలు టూ టౌన్ వారు కేసు కట్టారు. క్రైమ్ నెంబర్ 166/25 కేసు కట్టారు. నళిని కేసు లో తెలుగుదేశం పార్టీకి చెందిన సింగోతు శ్రీనివాసరావు ను కుటుంబ సభ్యులను రక్షించటానికి స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలతో బలవన్మరణం ఎస్సీ, ఎస్టీ యా క్ట్ వెయ్యకుండా కేసు కట్టారన్నారు. బల్వాన్మరణం కేసు ఎందుకు కట్టలేదని ఒంగోలు టూ టౌన్ సీఐ మేడ శ్రీనివాసరావును అడిగితే లీగల్ ఒపీనియన్ వచ్చిన తరువాత కేసు కడతామనీ కథలు చెప్పి కాలయాపన చేశారు. చట్టాల పట్ల కేసు నమోదు లో సరైన సెక్షన్లు వెయ్యకుండా లీగల్ ఒపీనియన్ చెప్పటం చెవులో పువ్వులు పెట్టటమేనని దళిత నేత నీలం నాగేంద్రరావు ఒంగోలు టూ టౌన్ సిఐ మేడా శ్రీనివాసరావును ప్రశ్నించారు. తరువాత నళిని బంధువులను హడావుడి చేసి శవాన్ని తీసుకొని వెళ్లాలని టూ టౌన్ సిఐ హైడ్రామా చేశాడు. రిమ్స్ హాస్పటల్ ముందు దళిత నేత నీలం నాగేంద్రరావు ఆధ్వర్యంలో ఒంగోలు టూ టౌన్ సిఐ ని సస్పెండ్ చేయాలని నళిని కేసులో బల్వన్మరణం ఎస్సీ ఎస్టీ సెక్షన్లు వేయాలని నినాదాలు చేశారు. తరువాత జిల్లా కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి ఆందోళన చేయటంతో తప్పనిసరి పరిస్థితుల్లో అప్పటికప్పుడు ఒంగోలు టూ టౌన్ సిఐ మేడా శ్రీనివాసరావు దళిత నేత నీలం నాగేంద్రరావు డిమాండ్ చేసినట్టు అనుమానాస్పద మరణం సెక్షను 108 బిఎన్ఎస్ బలవన్మరణం, 3(2)వి కింద 10 సంవత్సరాల శిక్ష పడే ఎస్సీ, ఎస్టీ కేసుగా మార్చిన కాపి అందజేశారు. తరువాత జిల్లా కలెక్టర్ రాజా బాబుకు మైరాల నళిని కేసు పై ఫిర్యాదు చేస్తే ఒంగోలు ఆర్టీవో లక్ష్మీ ప్రసన్నను విచారణకు ఆదేశిస్తే రెండు నెలలైనా కూత వేటు దూరంలో ఉన్న కబాడీ పాలెం రాలేదు. మరల దళిత నేత నీలం ఒత్తిడితో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న కబాడీపాలెం వచ్చి విచారించి రిపోర్టు ఆర్డీఓ పంపకుండా ఒంగోలు తాసిల్దార్ చే పంపించిందన్నారు. కలెక్టరేట్ వారు ఆ రిపోర్టు మరల తిరిగి వెనక్కి పంపించారన్నారు. మరల నీలం నాగేంద్రరావు జిల్లా కలెక్టరుకు ఒంగోలు ఆర్డీవో పై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు తప్పనిసరి పరిస్థితుల్లో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న మైరాల నళిని రిలీఫ్ విచారణ రిపోర్టును కలెక్టరేట్ కు పంపారు. మైరాల నళిని మాల కులానికి చెందినది కావటం, మైరాల నళినిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసి మైరాల నళిని మరణానికి కారణమైన సింగోత్ శ్రీనివాసు మత్స్యకార కుటుంబానికి చెందిన వారు కావడంతో ఒంగోలు ఎమ్మెల్యే మాలలకు వ్యతిరేకంగా తెలుగుదేశం ఓటు బ్యాంక్ అయిన తన నియోజకవర్గమైన కొత్తపట్నం మండలానికి చెందిన సింగోతు శ్రీనివాస్ కుటుంబానికి అండగా నిలిచారన్నారు. ఈ కేసులో సింగోతు శ్రీనివాసులు తల్లిదండ్రులను ఒంగోలు డిఎస్పి ఇంతవరకు అరెస్టు చేయలేదన్నారు. మైరాల నళిని బలవన్మరణం ఎస్సీ, ఎస్టీ క్రైమ్ నెంబర్ 166/25 కేసు గత సంవత్సరం డిసెంబర్ 7వ తేదీన జరిగిందన్నారు. దళిత నేత నీలం నాగేంద్రరావు ఒంగోలు ఆర్డీవో రిపోర్ట్ వచ్చిన తర్వాత జిల్లా ఎస్పీ ఆఫీసు నుంచి రిపోర్టు తెప్పించి నళిని తండ్రి మైరాల దేవదానంకు ప్రాథమికంగా రూ.4,12,500లు రిలీఫ్ జిల్లా కలెక్టర్ రాజాబాబు చే నీలం నాగేంద్రరావు మంజూరు చేయించారు. రిలీఫ్ ఆర్డర్ ని మైరాల నళిని తండ్రి దేవదానంకు నీలం నాగేంద్ర అందజేశారు. ఆయనతోపాటు స్థానిక పెద్దలు కట్ట సుధాకర్ ఉన్నారు.

## ఆటో డ్రైవర్లు రూల్స్ పాటించకుంటే చర్యలు తప్పవు

డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఉత్తర్వుల మేరకు ట్రాఫిక్ సిఐ హజరత్తయ్య ఆధ్వర్యంలో ట్రాఫిక్ అవేర్నెస్‌లో భాగంగా ఆదివారం ఒంగోలు నగరంలోని యూనిఫామ్ లేకుండా ఆటోలు నడుపుతున్న వారిని గుర్తించి వారికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగా ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనాలను అతి వేగంగా నడపరాదని, ఆడవారు ఆటోలు ఎక్కినపుడు వారితో జాగ్రత్తగా ప్రవర్తించాలని, ఆటో డ్రైవర్‌లు అందరు ఎంవి యాక్ట్ రూల్స్ పాటించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాల్యాద్రి, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## కారు అదుపుతప్పి బైక్ ఢీ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)

ఒంగోలులోని రాజధాని సెంటర్ సమీపంలో ఆదివారంరోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై ఉన్న వ్యక్తి గాలిలోకి ఎగిరి కారు అద్దాల పై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. కారు అతి వేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు.

## యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి శిద్ధా కుటుంబ సభ్యులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)

తెలంగాణ రాష్ట్రం యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ భవాని శంకర్, ప్రోటోకాల్ అధికారి రాజన్ బాబు అర్చకులతో కలసి శిద్దా రాఘవరావు దంపతులకు స్వాగతం పలికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటంతో పాటుగా వేద ఆశీర్వాదాలు అందచేశారు.

# అట్రాసిటీ చట్ట సాధన సమితి ఆధ్వర్యంలో నాట్య గురువు లక్ష్మీకి జాతీయ పురస్కారం









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)

కూచిపూడి నాట్యాన్ని నేర్పుతూ తన వంతు సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్న ఒంగోలుకు చెందిన కూచిపూడి నాట్య గురువు కే లక్ష్మికి అరుదైన గౌరవం లభించింది. నెల్లూరులోని బ్రాహ్మణ అట్రాసిటీ చట్ట సాధన సమితి జాతీయ సమావేశంలో భాగంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు చేతుల మీదుగా సన్మానం అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, మల్లాది విష్ణు, అలాగే వివిధ రాష్ట్రాలకు చెందిన బ్రాహ్మణ ప్రతినిధులు హాజరయ్యారు. అవధానం సాయికుమార్ జాతీయ అధ్యక్షులు బ్రాహ్మణ అట్రాసిటీ చట్ట సాధన సమితి అధ్యక్షతన ఈ పురస్కారాలు జరిగాయి. కూచిపూడి రంగంలో సేవలు అందిస్తున్న కే లక్ష్మి ఇతరులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూచిపూడి రంగాన్ని పలుచోట్ల శిక్షణ ఆలయాలు ఏర్పాటు చేసి నాట్యం నేర్పిస్తున్న కే లక్ష్మి సేవలు ప్రతి ఒక్కరు అభినందించాలని అన్నారు. సమాజంలో బ్రాహ్మణుల యొక్క గుర్తింపు ఇంకా పెరగాలన్నారు. బ్రాహ్మణ మహిళలు ఎన్నో అవకాశాలు ఉన్నాయని ప్రతి ఒక్కరు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కూచిపూడి నాట్యం యొక్క గొప్పతనం అందరికీ అర్థం అవ్వాలన్నారు. కూచిపూడి రంగం లాంటి నాట్యాన్ని గ్రామీణ ప్రాంతాల్లో విస్తరింపజేస్తూ తన వంతు కృషి చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలిచిన కే లక్ష్మి సేవలను ప్రతి ఒక్కరు గుర్తుకు తెచ్చుకొని ఆమెను అభినందించాలన్నారు. బ్రాహ్మణ మహిళగా తన వంతు కృషి చేస్తూ కూచిపూడి నాట్యాన్ని నేర్పిస్తున్న కే లక్ష్మి అందరికీ ఆదర్శమన్నారు. బ్రాహ్మణశ్రీ మహిళలు అందరూ కూడా ఏదో ఒక రంగంలో ఉన్నారని, అటువంటి వారి అందరిని కూడా ఒకే వేదిక పై తీసుకువచ్చి ఘనమైన సన్మానం చేయటం సంతోషకరమన్నారు. మాజీ ఎమ్మెల్యే లు మల్లాది విష్ణు, కోన రఘుపతి మాట్లాడుతూ బ్రాహ్మణుల అభివృద్ధి కోసం కృషి చేస్తామని, ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా బ్రాహ్మణులు ఏకం కావాలని అన్నారు. బ్రాహ్మణ సంక్షేమం కోసం తమవంతు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. నాట్య రంగంలో కృషి చేస్తున్న కే లక్ష్మి సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.

# ఘనంగా మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు

## జిల్లా వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన అభిమానులు ముఖ్య అతిధిగా హాజరైన యువ నాయకుడు శిద్దా సుధీర్ కుమార్






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 31)**
మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా లక్ష్మి పద్మావతి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ ఏ గిరి బాబు, కాట్రగడ్డ రమణయ్య ఆధ్వర్యంలో చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా శిద్దా సుధీర్ కుమార్ క్షేత్రంలో కొలువైయున్న సర్వదేవతలకు విశేష పూజలు నిర్వహించారు. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకును శిద్దా సుధీర్ కుమార్ కట్ చేశారు. ఏ గిరి, రమణయ్య, ఏర్పాటు చేసిన భారీ గజమాల, శాలువాతో సత్కరించారు. అనంతరం ఆలయ ఇంచార్జి ఎం వెంకటేశ్వర్లు, వాసవి గ్రానైట్ సిబ్బంది, చీమకుర్తికి చెందిన ప్రముఖులు సుధీర్ కుమార్‌కు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేశారు.

### సేవా కార్యక్రమాలతో స్ఫూర్తిని నిలిపిన మాజీ మంత్రి వివాహ వార్షికోత్సవ వేడుకలు

మాజీ మంత్రి శిద్దా రాఘవరావు లక్ష్మి పద్మావతి దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా చీమకుర్తి హరిహర క్షేత్రంలో ఎ గిరిబాబు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలకి శ్రీకారం చుట్టారు. చీమకుర్తి మండలంలోని 30 అంగన్వాడీ సెంటర్స్‌కు గ్యాస్ కుక్కర్లు, పాటిమీదపాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మిడ్ డే మీల్స్ కొరకు సంవత్సరకాలానికి వంట గ్యాస్ ఖర్చు, నాగు లుప్పలపాడు గ్రామంలో శివాలయం ధ్వజ స్తంభం పునః ప్రతిష్ట కోసం రూ.50 వేలు విరాళం, చీమకుర్తి మండలంలోని అంగన్వాడీ సూపర్వైజర్స్, సిడిపిఓల ఉత్తమ సేవలు అందించినందుకు సన్మానం, నెల్లూరు జిల్లా సైదాపురం మండలం కలిబేడు గ్రామంలో ఎమ్.ఎమ్.ఎల్.డబ్ల్యూ.ఓ స్కూల్‌లో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను యువ నాయకులు శిద్దా సుదీర్ కుమార్ స్వయంగా అందించారు. ఈ సందర్భంగా శిద్దా సుధీర్ కుమార్ మాట్లాడుతూ అమ్మ నాన్నల వివాహ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ హరిహర క్షేత్రంలో అభిమానులు నిర్వహించిన సేవా కార్యక్రమాలు సంతృప్తి కలిగించాయని, మానవ సేవే మాధవ సేవ అని అమ్మ నాన్న పెళ్లి రోజు సందర్భంగా ప్రతి ఏటా అనవాయితీగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, ఇంకా రాబోయే కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని సుధీర్ కుమార్ తెలిపారు. వేడుకలలో పాల్గొన్న అభిమానులకు, శ్రేయోభిలాషులకు, సన్నిహితులకు సుధీర్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆలయ అర్చకులు శిద్దా సుధీర్ కుమార్ కు వేద ఆశిస్సులు అందచేశారు. ఈ కార్యక్రమంలో శిద్దా సుధాకర్, టీడీపీ నాయకులు,కాట్రగడ్డ రమణయ్య, జ్యోతి గ్రానైట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎమ్ శివరామ్, బొమ్మిశెట్టి కిరణ్ కుమార్, నూకల సురేంద్ర, కందిమళ్ల గంగాధర్, కూరపాటి సుబ్బారావు, చీమకుర్తి వాసవి మహిళలు సువర్ణ, ఒంగోలు చీమకుర్తి దర్శి పారిశ్రామిత్తులు వ్యాపార వాణిజ్య వేత్తలు జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఎం వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు, అభిమానులు పాల్గొన్నారు.







# కంభంలో ప్రభుత్వ సేవలకు వాట్సప్ నంబర్



**(షణ్ముఖ వెలుగు, కంభం, మే 31)**
కంభం మండల పరిధిలో ప్రజలకు అవసరమైన వివిధ ప్రభుత్వ సేవలను ఇకపై సులభంగా పొందేందుకు ప్రత్యేకంగా వాట్సాప్ మనమిత్ర నంబర్ 9552300009 అందుబాటులో ఉంచినట్లు స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు మండల డిప్యూటీ ఎంపీడీవో దేవరశెట్టి బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆయన తెలియ జేస్తూ ప్రజలు తమ మొబైల్ నుండి 95523 00009 నంబర్‌కు “హెచ్ఐ” అని మెసేజ్ పంపడం ద్వారా ప్రభుత్వ సేవలకు సంబంధించిన సమాచారం, సేవలు, సర్టిఫికెట్ల వివరాలను పొందవచ్చని తెలిపారు.

వాట్సాప్ సేవ ద్వారా

**అందుబాటులో ఉన్న ముఖ్యమైన సేవలు**

కరెంట్ బిల్లు, మీటర్‌కు సంబంధించిన సేవలు, ఇన్‌కమ్, కులం, బర్త్, తదితర ధృవీకరణ పత్రాల సేవలు తల్లికి వందనం సేవలు, రైతులకు సంబంధించిన సేవలు, ఇళ్ల స్థలాలు, భూమి రికార్డులు, రేషన్ తదితర సేవలు, అదే విధంగా భవిష్యత్తులో మరిన్ని ప్రభుత్వ సేవలను కూడా ఈ వేదిక ద్వారా ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. కంభం మండల ప్రజలు ఈ సేవలను వినియోగించుకొని ప్రభుత్వ సేవలను సులభంగా పొందాలని కంభం మండలం స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు డిప్యూటీ ఎంపీడీవో దేవరశెట్టి బ్రహ్మయ్య తెలిపారు.

# ఋగ్వేద నిధి, శతాధిక వృద్ధులు

## డాక్టర్ ఐలా వజ్జుల రామకృష్ణ శాస్త్రి ఇక లేరు

## నివాళులర్పించిన కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి





**(షణ్ముఖ వెలుగు, బద్వేలు, మే 31)**
ఆధ్యాత్మిక నగరమైన బద్వేల్ పట్టణంలో ఒక అద్భుతమైన జ్ఞాన శకం ముగిసింది. ప్రముఖ ఋగ్వేద పండితులు, ప్రతిష్ఠా గ్రంథ సంకలనకర్త, అపర అమ్మవారి ఉపాసకులు డాక్టర్ ఐలా వజ్జుల రామకృష్ణ శాస్త్రి శివైక్యం చెందడం ఆధ్యాత్మిక లోకానికి తీరని లోటు. నూరేళ్లకు పైగా (శతాధిక) సార్థక జీవనాన్ని గడిపిన ఆయన, తన జీవితాంతం వేద విజ్ఞాన వ్యాప్తికి, ధర్మ రక్షణకు అంకితం చేశారు.?రామకృష్ణ శాస్త్రి కేవలం పూజా కార్యక్రమాలకే పరిమితం కాకుండా, ఎన్నో విలువైన ప్రతిష్ఠా గ్రంథాలను సంకలనం చేసి రాబోయే తరాలకు ఆధ్యాత్మిక నిధిని అందించారు. అమ్మవారి ఉపాసకులుగా ఉంటూ, బద్వేల్ ప్రాంతంలో ఎన్నో దేవాలయాల ప్రతిష్ఠాపనల్లో, ధార్మిక కార్యక్రమాల్లో ఆయన ముఖ్య భూమిక పోషించారు. వందేళ్ల వయసు దాటినా కూడా ఆయన ముఖంలో కనిపించే వేద వర్చస్సు, ఆధ్యాత్మిక తేజస్సు చూసేవారికి భక్తిభావాన్ని కలిగించేవి. భౌతిక కాయానికి డీసీసీ బ్యాంక్ చైర్మన్ నివాళి: శాస్త్రి మరణవార్త తెలియగానే ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి బద్వేల్‌లోని ఆయన నివాసానికి చేరుకున్నారు. శాస్త్రి భౌతిక కాయానికి పూలమాల వేసి అశ్రునయనాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంచూరు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ఐలా వజ్జుల రామకృష్ణ శాస్త్రి బద్వేల్ ప్రాంతానికే కాకుండా, యావత్ సమాజానికి ఒక గొప్ప మార్గదర్శి. నూరేళ్ల పైన జీవించి, ఎన్నో పుస్తకాలు రాసి, వేద విద్యను బతికించిన ఆయన సేవలు చిరస్మరణీయం. వారి మరణం ఆధ్యాత్మిక రంగానికి పెద్ద వెలితి. అనంతరం సూర్యనారాయణరెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భగవంతుడు వారి ఆత్మకు సద్గతులు ప్రసాదించాలని, కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు.

**తరలివచ్చిన నాయకులు, భక్తులు :** శాస్త్రికి నివాళులర్పించిన వారిలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో ఆయన భక్తులు, శిష్యులు ఉన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com